క్లుప్తంగా

దత్తాత్రేయుడికి విశేష పూజలు



శ్రీశైలం టెంపుల్: లోకకల్యాణం కోసం దేవస్థానం గురువారం ఆలయ ప్రాంగణంలోని త్రిఫలవక్షం కింద నెలకొని ఉన్న దత్తాత్రేయ స్వామి వారికి గురువారం విశేష పూజలు నిర్వహించారు. ముందుగా మహాగణపతిపూజను జరిపించారు. అనంతరం దత్తాత్రేయస్వామివారికి పంచామతాభిషేకం, విశేష పూజలు నిర్వహించారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న ధర్మపథం కార్యక్రమంలో భాగంగా గురువారం ఆలయ దక్షిణ మాడవీధిలోని నిత్యకళావేదికపై కర్నూలుకు చెందిన మాతా సత్సంగ్ వారి శివానంద లహరి, సౌందర్యలహరి పారాయణ కార్యక్రమం పలువురు భక్తులను అలరించింది. రెండవ కార్యక్రమంలో భాగంగా నంద్యాల జిల్లా బొల్లవరానికి చెందిన ఎస్.రామన్నగౌడ్, బృందం భజన కార్యక్రమం ఆకట్టుకుంది.

అంజన్నకు నవగ్రహ హోమ పూజలు



ఆంజనేయస్వామి

ఆత్మకూరు: పట్టణంలోని ఆంజనేయస్వామి ఆలయంలో గురువారం నవగ్రహ హోమ సంపూర్ణ పూజలు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి పూజల్లో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు.

సిమెంట్ పైపుల ఏర్పాటు



సిమెంట్ పైపులు ఏర్పాటు చేయిస్తున్న సర్పంచ్

పాములపాడు: తాగునీటి పైపులు పదేపదే పగిలిపోతుండటంతో సిమెంట్ పైపులు వేయించినట్లు క్రిష్టారావు పేట గ్రామ సర్పంచు వరప్రసాద్ తెలిపారు. గురువారం ఆయన దగ్గరుండి పనులను పర్యవేక్షించారు. ఈసందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ గ్రామంలోని ప్రధాన రహదారిపై భారీ వాహనాల రద్దీతో తరచూ పైపులు పగిలిపోతూ నీటి సమస్య ఏర్పడేదన్నారు. దీంతో శాశ్వత పరిష్కారానికి చర్యలు తీసుకున్నట్లు తెలిపారు.

పుస్తకాల విరాళం



ఫౌండేషన్ అందించిన పుస్తకాలతో కళాశాల సిబ్బంది

శ్రీశైలంప్రాజెక్ట్: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు న్యూఢిల్లీకి చెందిన సుల్తాన్ చంద్ ద్రౌపదీదేవి ఎడ్యుకేషన్ ఫౌండేషన్ రూ.45,750 విలువ చేసే పుస్తకాలను విరాళంగా అందించినట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ పి.హుస్సేన్‌బాషా గురువారం తెలిపారు. వాణిజ్య, భౌతిక శాస్త్రాలకు సంబంధించిన పుస్తకాలను ఫౌండేషన్ అందజేసిందని, కళాశాల లైబ్రరీలో విద్యార్థులకు అందుబాటులో ఉంచుతామని ఆయన తెలిపారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.బుచ్చయ్య పాల్గొన్నారు.

అందుబాటులో ఉచిత కైలాస రథం



కైలాస రథాన్ని నడుపుతున్న దాత కోటేశ్వరరావు

శ్రీశైలంప్రాజెక్ట్: శ్రీశైలం మండల ప్రజలకు ఉచిత కైలాస రథాన్ని సున్నిపెంటకు చెందిన కోటేశ్వరరావు అందుబాటులోకి తెచ్చారు. శ్రీశైలం, సున్నిపెంట, లింగాలగట్టు గ్రామ ప్రజలు ఎవరైనా తమ కుటుంబసభ్యుడిని కోల్పోతే ఉచితంగా కైలాస రథంలో శ్మశాన వాటికకు చేరుస్తారు. గతంలో అటవీశాఖలో తాత్కాలిక పద్ధతిన పనిచేసి విరమించిన కోటేశ్వరరావు ప్రజలకు సేవచేయాలనే భావనతో స్వంత ఖర్చులతో వాహనాన్ని ఏర్పాటు చేశారు. కై లాస రథం అవసరమైన వారు 6301584075ను సంప్రదించాలని కోటేశ్వరరావు సూచించారు.

వ్యాపారికి బెదిరింపులు.. ముగ్గురి అరెస్ట్

డోన్ టౌన్: పట్టణంలో పండ్ల వ్యాపారిని బెదిరించి కాటా తీసుకెళ్లిన ముగ్గురు నిందితులను పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. గురువారం సీఐ ఇంతియాజ్ బాషా తన కార్యాలయంలో విలేకరులకు వివరాలు వెల్లడించారు. అనంతపురం జిల్లా గుత్తికి చెందిన సయ్యద్ నూర్ బాషా డోన్‌లో పండ్ల వ్యాపారం చేస్తుండగా పాతపేటకు చెందిన గొల్ల రఘు అలియాస్ జామకాయల రవి, ఉప్పరి సురేంద్ర, చిగురమానుపేటకు చెందిన అబ్బాస్ బెదిరించారు. వ్యాపారం చేయాలంటే తమ అనుమతి తప్పనిసరి అని హెచ్చరించినట్లు బాధితుడు ఫిర్యాదు చేశాడు. దీనిపై కేసు నమోదు చేసి ముగ్గురిని గురువారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామని సీఐ తెలిపారు.



ఆత్మకూరు పట్టణంలో కురుస్తున్న వర్షం

భారీ వర్షం..అన్నదాతలకు నష్టం

- లోతట్టు కాలనీలు జలమయం.
- నీట మునిగిన పంట పొలాలు
- పొంగిపొర్లిన భవనాశి, సుద్దవాగు, గుండ్లకమ్మ వాగులు

ఆత్మకూరులో భారీ వర్షం కురిసింది. బుధవారం రాత్రి నుంచి గురువారం ఉదయం వరకు ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షానికి భవనాశి, సుద్దవాగు, గుండ్లకమ్మ వాగులు పొంగి పొర్లాయి. లోతట్టుప్రాంతాలు లక్ష్మీనగర్, ఏకలవ్యనగర్, అర్బన్ కాలనీలను వర్షపునీరు ముంచెత్తింది. సాయంత్రానికి భవనాశి, సుద్దవాగుల ప్రవాహం ప్రమాదస్థాయికి చేరుకున్నాయి. పైర్లు నీట మునిగాయి. వరదరాజస్వామి ప్రాజెక్టు నిండి గేట్లు ఎత్తితే పంటలు పూర్తిగా తుడిచిపెట్టుకుపోతాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

– ఆత్మకూరు



శివారు కాలనీలో నిలిచిన వర్షపునీరు

- బండి ఆత్మకూరు: మండల వ్యాప్తంగా 56.2 మి.మీ. వర్షపాతం నమోదైందని తహసీల్దార్ పద్మావతి తెలిపారు. గురువారం తెల్లవారుజాము నుంచి కురిసిన వర్షానికి మండలంలోని చెరువులు, కాలువలు నిండిపోయాయి. అక్కడక్కడా వరి పైర్లు నీట మునిగాయి.



లింగాపురం సమీపంలో నీట మునిగిన వరి పంట

- పాములపాడు: మండలంలో 5.2 మిల్లీ మీటర్ల వర్షం కురిసింది. ఇస్కాల గ్రామ సమీపంలో ఉన్న భవనాశి వాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. నల్లమల అడవీ ప్రాంతంలో నుంచి వచ్చిన వర్షపు నీరు భవనాశి నదిలో చేరడంతో నది పొంగి ప్రవహిస్తోంది. దీంతో రాకపోకలు నిలిచిపోయాయి. అత్యవసరమైన పనుల నిమిత్తం ఆత్మకూరు, చెలిమిల్ల గ్రామాల మీదుగా మండల కేంద్రానికి చేరుకుంటున్నారు. వర్షం కురిసిన ప్రతిసారీ ఇదే పరిస్థితి దాపురిస్తోందని గ్రామస్తులు వాపోతున్నారు. భవనాశిపై వంతెన నిర్మాణం చేపట్టాలని కోరుతున్నారు.



ఉధృతంగా ప్రవహిస్తున్న భవనాశినది



జలమయమైన గువ్వలగుంట్ల ఎస్సీ కాలనీ

- కొత్తపల్లి: మండలంలో కుండపోత వర్షం కురిసింది. పలు కాలనీలు జలమయమయ్యాయి. గువ్వలకుంట్ల గ్రామంలో ఎస్సీ కాలనీలో ఇళ్లలోకి వర్షపు నీరు చేరింది. భారీ వృక్షాలు విరిగి విద్యుత్ తీగలపై పడడంతో మూడు స్తంభాలు నేల వాలాయి. ఉదయం నుంచి సాయంత్రం వరకు విద్యుత్ అంతరాయం ఏర్పడడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. విద్యుత్ అధికారుల శ్రమించి పునరుద్ధరణ చర్యలు చేపట్టారు. వీరాపురం ఎస్సీ కాలనీలో, కొత్తపల్లి బీసీ కాలనీలో, కొత్తపల్లి మెయిన్ బజార్ జలమయమయ్యాయి. తాండవ మల్లేశ్వర స్వామి ఆలయంలోకి నీరు చేరి శివలింగం మునిగిపోయింది. లింగాపురంలో ప్రధాన రహదారి జలమయమైంది. నందికుంట నుంచి ఆత్మకూరు వెళ్లే ప్రధాన రహదారిలో వర్షపు నీరు నిలవడంతో వాహనదారులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.
- జూపాడుబంగ్లా: మండలంలో గురువారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు కురిసిన మోస్తరు వర్షంతో వాతావరణం చల్లబడింది. 0.8 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు ఏఎస్ఓ హనుమంతు తెలిపారు. పాములపాడులో 5.2ఎం.ఎం, మిడుతూరు, పగిద్యాల మండలాల్లో 2.4 ఎం.ఎం, నందికొట్కూరులో 1.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు ఏఎస్ఓ తెలిపారు.



కొత్తపల్లి తాండవ మల్లేశ్వర స్వామి ఆలయంలో నీట మునిగిన శివలింగం



నందికుంట వద్ద నీట మునిగిన మొక్కజొన్న పంట

లోక్ అదాలత్‌ను విజయవంతం చేయండి



మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి ఎ. శోభారాణి

నందికొట్కూరు: ఈనెల 13న నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలని సీనియర్ సివిల్ జడ్జి ఎ.శోభారాణి సూచించారు. గురువారం కోర్టు చాంబర్‌లో జాతీయ లోక్ అదాలత్‌పై పోలీసులు, న్యాయవాదులతో జరిగిన సమీక్షా సమావేశంలో జడ్జి మాట్లాడారు. లోక్ అదాలత్ ద్వారా అప్పీలు లేని తీర్పును పొందవచ్చనే విషయాన్ని కక్షిదారులకు అవగాహన కల్పించాలన్నారు. జూనియర్ సివిల్ జడ్జి పి.రాహుల్ అంబేడ్కర్ మాట్లాడుతూ సివిల్, క్రిమినల్ తగాదాలను పరిష్కరిస్తామన్నారు. ఈ అవకాశాన్ని కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సమావేశంలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు శరబయ్య, డీఎస్పీ రామాంజనేయులు నాయక్, సీఐలు సుబ్రహ్మణ్యం, ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, ఎస్ఐలు, న్యాయవాదులు పాల్గొన్నారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగించొద్దు



మాట్లాడుతున్న రూరల్ సీఐ సుబ్రహ్మణ్యం

పగిడ్యాల: శాంతిభద్రతలకు ఆటంకం కలిగించొద్దని నందికొట్కూరు రూరల్ సీఐ సుబ్రహ్మణ్యం సూచించారు. గురువారం రాత్రి పాత ముచ్చుమర్రిలో ఏర్పాటు చేసిన గ్రామసభలో ఆయన మాట్లాడారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కేసులు నమోదు చేసి జైలుకు పంపుతామని హెచ్చరించారు. పేకాట, జూదం, నాటుసారా, అక్రమ మద్యం విక్రయాలు వంటి చట్ట వ్యతిరేక చర్యలకు ఎవరు పాల్పడినా ఉపేక్షించేది లేదన్నారు. అలాంటి వారిపై రౌడీషీట్ ఓపెన్ చేసి గ్రామ బహిష్కరణ చేయిస్తామన్నారు. ప్రశాంతమైన జీవనం సాగించాలని, సమస్యలు వస్తే శాంతియుత వాతావరణంలో పరిష్కరించుకోవాలని, అవసరమైతే పోలీస్ స్టేషన్‌ను ఆశ్రయించి న్యాయం పొందాలని సూచించారు. ఆలయాలు, చర్చీలు, మసీదులు, పాఠశాలల వద్ద నాటుసారా, అక్రమ మద్యం విక్రయాలు చేయరాదని హెచ్చరించారు. ఆయన వెంట ఏఎస్ఐ శేషమ్మ ఉన్నారు.

ప్రథమ చికిత్స కేంద్రం తనిఖీ



ప్రథమ చికిత్స కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న డాక్టర్ దినేష్

బండి ఆత్మకూరు: మండల పరిధిలోని సంతజూటూరు గ్రామంలో ఉన్న ప్రథమ చికిత్స కేంద్రాన్ని గురువారం నారాయణాపురం ప్రభుత్వ ఆసుపత్రి మెడికల్ ఆఫీసర్ డాక్టర్ దినేష్ తనిఖీ చేశారు. భోజనం గ్రామానికి చెందిన శ్రీనివాసులు అనారోగ్యానికి గురికాగా ప్రథమ చికిత్స కేంద్రంలోని ఆర్ఎంపీ పరశురామను సంప్రదించాడు. ఆర్ఎంపీ ఇచ్చిన ఇంజక్షన్ వికటించి అస్వస్థతకు గురయ్యానని బాధితుడు ఫిర్యాదు చేయడంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ప్రథమ చికిత్స కేంద్రాన్ని తనిఖీ చేశారు. రోగికి ఇచ్చిన ఇంజక్షన్ మందు, ఇచ్చిన విధానం, వాడిన పరికరాల వివరాలతో నివేదికను తయారు చేసి డీఎంహెచ్ఓకు సమర్పించనున్నట్లు డాక్టర్ దినేష్ తెలిపారు.

కబడ్డీ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శుల నియామకం

నంద్యాల(న్యూటౌన్): నంద్యాల జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులుగా చింతలమోహన్‌రావు యాదవ్, ఎం.సుబ్రహ్మణ్యంను ఆంధ్ర కబడ్డీ అసోసియేషన్ కార్యదర్శి శ్రీకాంత్ నియమించారు. గురువారం నూతన అధ్యక్ష, కార్యదర్శులు మాట్లాడుతూ నంద్యాల జిల్లా స్థాయి జూనియర్ బాల,బాలికల కబడ్డీ క్రీడాకారుల ఎంపిక ఈనెల 14వ తేదీన స్థానిక ఇండోర్ స్టేడియంలో నిర్వహిస్తామన్నారు. అలాగే 26 జిల్లాల అంతర్‌రాష్ట్ర స్థాయి జూనియర్ బాల,బాలికల కబడ్డీ పోటీలు ఎన్టీఆర్ జిల్లా గొల్లపూడిలో ఈనెల 22 నుంచి 25వ తేదీ వరకు జరుగుతాయని చెప్పారు. 51వ రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల్లో భాగంగా నంద్యాల జిల్లా బాల,బాలికల కబడ్డీ జట్టును ఎంపిక చేస్తున్నట్లు తెలిపారు. పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు 2006 జనవరి 1 తర్వాత జన్మించి ఉండాలన్నారు. బాలురు 75 కేజీలు, బాలికల 65 కేజీల్లోపు బరువు కలిగిన వారు అర్హులన్నారు. జనన ధ్రువ పత్రం, పదో తరగతి సర్టిఫికెట్, ఆధార్ కార్డుతో ఉదయం 9గంటలకు ఇండోర్ స్టేడియంలో పాల్గొనాలని సూచించారు. వివరాలకు సెల్ : 9441243601 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

క్రీడలతో పాటు విద్యలో రాణించాలి

నందికొట్కూరు: క్రీడలతో పాటు విద్యలో రాణించాలని జెడ్పీ హైస్కూల్(కోటా) హెచ్ఎం కౌసల్యాబాయి విద్యార్థులకు సూచించారు. కర్నూలు స్టేడియంలో గురువారం జరిగిన జిల్లా స్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్-17 బాలుర ఆర్చరీ పోటీలలో ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయికి ఎంపికైన దేశావత్ దీపక్ నాయక్, కంభం సాయి చరణ్‌ను పీడీ శ్రీనాథ్, ఉపాధ్యాయులతో కలిసి హెచ్ఎం అభినందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దేశావత్ దీపక్ నాయక్ రికర్వ్ విభాగంలోనూ, సాయి చరణ్ కాంపౌండ్ విభాగంలోనూ ప్రతిభ చూపి త్వరలో శ్రీకాకుళంలో జరగబోయే రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక కావడం సం తోషకరమన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సాలమ్మ, సరిత, లలితమ్మ, సరోజినిదేవి, షంషాద్‌బేగం, లలితకుమార్, అనితాశ్రీ, వెంకటరమణ, ఈశ్వరయ్య, మల్లికార్జునరెడ్డి, రామిరెడ్డి, వెంకటేశ్వర్లు, నాగేషులు పాల్గొన్నారు.

నెల రోజుల శిక్షణకు ఎంపీడీఓ

జూపాడుబంగ్లా: ఎంపీడీఓ గోపికృష్ణ నెలరోజుల శిక్షణ నిమిత్తం శ్రీకాళహస్తికి వెళ్లారు. దీంతో డిప్యూటీ ఎంపీడీఓ పద్మావతికి ఇన్‌చార్జ్ ఎంపీడీఓ బాధ్యతలు అప్పగిస్తూ జిల్లా అధికారులు ఉత్తర్వులు జారీచేశారు. గోపికృష్ణ 2023లో ఎంపీడీఓ పదోన్నతి పొందారు. రాష్ట్ర వ్యాప్తంగా ఆయనతో పాటు పదోన్నతులు పొందిన వారికి శ్రీకాళహస్తిలో నెలరోజుల పాటు ఎంపీడీఓ విధులపై శిక్షణ తరగతులు నిర్వహించనున్నారు.

ఫీల్డ్ అసిస్టెంట్ నియామకం

జూపాడుబంగ్లా: తాటిపాడు గ్రామ ఫీల్డ్ అసిస్టెంట్‌గా తెలుగు పద్మావతిని నియమిస్తూ డ్వామా పీడీ సూర్యనారాయణ ఉత్తర్వులు జారీచేశారు. అవినీతి, అక్రమాలకు పాల్పడటంతో గత ఫీల్డ్ అసిస్టెంట్ బోయ చిన్నలింగన్నను రెండు నెలల క్రితం విధుల నుంచి తొలగించారు. ఈక్రమంలో నూతన ఫీల్డ్‌అసిస్టెంట్‌గా పద్మావతిని నియమించారు.

15 నుంచి పశువులకు గాలికుంటు టీకాలు

జూపాడుబంగ్లా: ఈనెల 15 నుంచి పశువులకు గాలికుంటు టీకాలు వేయనున్నట్లు పశుసంవర్ధక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ రామాంజినేయ నాయక్ తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ యజమానులు తమ పశువులు, జీవాలకు టీకాలు వేయించుకోవాలన్నారు. రైతుసేవా కేంద్రాలు, పశువైద్యశాలలో రాయితీపై పశుగ్రాసం విత్తనాలు అందజేస్తున్నామన్నారు. పశుపోషకులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

జీవితాలు నాశనం చేసుకోవద్దు



గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎస్ఐ మల్లికార్జున

జూపాడుంగ్లా: క్షణికావేశానికిలోనై జీవితాలు నాశనం చేసుకోవద్దని ఎస్ఐ మల్లికార్జున సూచించారు. గురువారం రాత్రి 80బన్నూరు గ్రామంలో పల్లెనిద్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులతో ఆయన మాట్లాడుతూ ఎలాంటి తగాదాల జోలికి వెళ్లకుండా ప్రశాంతంగా జీవించటం అలవర్చుకోవాలన్నారు. సమస్యలు నెలకొన్నప్పుడు ఆవేశానికిలోనై ఘర్షణలకు పాల్పడకుండా పోలీసులను ఆశ్రయించి సామరస్యంగా పరిష్కరించుకోవాలన్నారు. సైబర్ నేరస్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, గుర్తుతెలియని వ్యక్తులకు ఆధార్, బ్యాంకు, ఓటీపీ నంబర్లు చెప్పవద్దన్నారు. హెల్మెట్ లేకుండా, మద్యం తాగి ద్విచక్రవాహనాలపై ప్రయాణించవద్దన్నారు. గ్రామంలో ఎవరైనా అనుమానితంగా సంచరిస్తున్నట్లయితే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. మహిళలు, బాలికల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించినా, లైంగికంగా వేధించినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఒకే రోజు ఆరు ఇళ్లలో చోరీ

- 15 తులాల బంగారం, రూ.1.92 లక్షల నగదు అపహరణ
- హెచ్ కొట్టాలలో రెచ్చిపోయిన ముసుగు దొంగలు



రవి శంకర్ ఇంట్లో దుండగులు ధ్వంసం చేసిన బీరువాలు, చిందరవందరగా పడేసిన వస్తువులు

బేతంచెర్ల: మండలంలోని హెచ్.కొట్టాల గ్రామంలో ఎప్పుడూ లేని విధంగా ఒకే రోజు ఆరు ఇళ్లలో చోరీలు జరిగాయి. దీంతో గ్రామంలో భయాందోళన వాతావరణం నెలకొంది. బుధవారం రాత్రి గుర్తు తెలియని దొంగలు బోయపాటి రవిశంకర్, ఉన్నం ధనుంజయ, యండూరి తిరుపాలు, యండూరి మోహన్‌రావు, చికెన్ బాషా, మంజుల అరుణ ఇళ్లలో తాళాలు పగుల గొట్టి బంగారం, వెండి, నగదు, మొబైల్ ఫోన్లు దోచుకెళ్లారు. రవిశంకర్ ఇంటి నుంచి 12 తులాల బంగారం, 10 తులాల వెండి, రూ.20 వేల నగదు అపహరించారు. లారీ డ్రైవర్ ధనుంజయ ఇంట్లో రూ.72 వేల నగదు, యండూరి తిరుపాలు ఇంట్లో మూడు సెల్‌ఫోన్లు, మంజుల అరుణ ఇంట్లో 3 తులాల బంగారం, 16 తులాల వెండి, రూ.1 లక్ష నగదు చోరీ చేశారు. చికెన్ బాషా ఇంట్లో రూ. 500 నగదు చోరీ చేశారు. యండూరి మోహన్ రావు ఇంటి తాళాలు పగులగొట్టి ఏమీ దొరకకపోవడంతో వెళ్లిపోయారు. ఒక ఇంట్లో మాత్రం మనుషులు ఉండడంతో చోరీ విఫలమైంది. ఆ ఇంట్లోని సీసీ కెమెరాల్లో ముసుగు ధరించిన నలుగురు వ్యక్తులు కనిపించారు. అయితే మొత్తం ఆరు ఇళ్లలో చోరీలు నలుగురే చేశారా లేక మరికొందరా అన్నది పోలీసుల దర్యాప్తులో తేలాల్సి ఉంది. గ్రామంలో ఒకేసారి ఆరు ఇళ్లలో దొంగతనాలు జరగడంతో గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

సంక్షిప్తం

దసరా ఉత్సవాలకు ఏర్పాట్లు చేయండి

మహానంది: దసరా నవరాత్రి ఉత్సవాలకు అన్ని ఏర్పాట్లు చేపట్టాలని మహానంది ఆలయ ఈఓ నల్లకాల్వ శ్రీనివాసరెడ్డి తెలిపారు. పూలు, పూలమాలల సరఫరాకు గురువారం షీల్డ్ టెండర్లను నిర్వహించగా అంబూరు జగన్ రూ.8.30 లక్షలకు దక్కించుకున్నారు. విద్యుత్ అలంకరణ పనులకు నంద్యాల మణికంఠ సంప్లయర్స్ అండ్ డెకరేషన్ రూ.2.50 లక్షలకు దక్కించుకున్నట్లు ఈఓ తెలిపారు.

గంధం స్వామి జార్తలు

మహానంది: మండలంలోని తమ్మడపల్లె గ్రామంలో గురువారం రాత్రి గంధం స్వామి జార్తులు ప్రారంభమయ్యాయి.

15.2 మిల్లీమీటర్ల వర్షం

మహానంది: మండలంలో 15.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. తిమ్మాపురం జిల్లా పరిషత్ పాఠశాల ప్రాంగణంలో వర్షపు నీరు నిలవడంతో విద్యార్థులకు అసౌకర్యంగా మారింది.

- మహానంది: భద్రాద్రి జిల్లా జూలూరుపాడు గ్రామ పాఠశాల రికార్డు అసిస్టెంట్ శివ తిప్పర్తి ప్లాస్టిక్ నిషేధంపై అవగాన కల్పిస్తున్నారు. ప్లాస్టిక్ పెను భూతం, ప్లాస్టిక్‌ను నిషేధిస్తేనే ఆరోగ్యం అక్షరాలున్న టోపీ, దుస్తులు ధరించి రెండు రాష్ట్రాల్లో ప్రచారం నిర్వహిస్తూ గురువారం మహానంది చేరుకున్నారు.

విరిగిపడిన కొండ చరియలు



మద్దిలేటిస్వామి ఆలయం వద్ద విరిగిపడిన కొండ చరియలు

బేతంచెర్ల: మండల పరిధిలోని మద్దిలేటి లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో గురువారం కురిసిన భారీ వర్షానికి ఆలయ పక్కన కొండచరియలు విరిగి పడ్డాయి. ఆ సమయానికి భక్తులు ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. గతంలో ఆలయ నిర్మాణ పనుల కోసం కొండను తొలగించినప్పటికీ, పూర్తి స్థాయిలో తొలగించకపోవడంతో వర్షాకాలంలో అప్పుడప్పుడూ రాళ్లు కూలిపోతున్నాయని అధికారులు తెలిపారు. ఈ అంశాన్ని ఆలయ ఈఓ రామాంజనేయులు దృష్టికి తీసుకెళ్లగా, ఇంకా కొంత కొండ తొలగింపు అవసరం ఉందని.. ఇంజినీరింగ్ సిబ్బంది ఇప్పటికే ప్లాన్, ఎస్టిమేట్‌లు సిద్ధం చేసి సమర్పించారని తెలిపారు. దేవదాయశాఖ కమిషనర్ అనుమతి పొంది తగిన చర్యలు తీసుకుంటామన్నారు.

సమస్యలను పరిష్కరించాలి



మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు

నందికొట్కూరు: మారుతీ నగర్‌లో విద్యుత్, రోడ్లు, తాగునీటి సమస్యలను పరిష్కరించాలని సీపీఎం నాయకులు నాగేశ్వరరావు గురువారం మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి అధికారులకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలనీ ఏర్పడి 30 ఏళ్లవుతున్నా కనీసం రోడ్లు, విద్యుత్, తాగునీటి సౌకర్యాలు కల్పించలేదన్నారు. రోడ్లు లేక వృద్ధులు, మహిళలు, చిన్న పిల్లలు రాకపోకలకు తీవ్ర ఇక్కట్లు పడుతున్నా మున్సిపల్ అధికారులు పట్టించుకోకపోవడం తగదన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సమస్యలను పరిష్కరించాలని, లేకపోతే కాలనీవాసులతో కలిసి ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో కాలనీవాసులు హుసేన్, అబ్దుల్లా, చిట్టెన్న, చరణ్, రవి, శశాంక్, రామకృష్ణ, మద్దిలేటి పాల్గొన్నారు.